

క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డిని హైదరాబాద్‌లో మాజీ ఎమ్మెల్సీ డి.రాజేశ్వర్ రావు ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా రాజేశ్వర్‌రావుకు ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి-నీరజారెడ్డి దంపతులు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.
–కమ్మర్‌పల్లి, డిసెంబర్ 24



ముస్తాబైన నిజామాబాద్ సీఎస్ఐ చర్చి

నేడు క్రిస్మస్ .. క్రైస్తవుల పండుగల్లో అతిముఖ్యమైనది. ఆదివారం అర్ధరాత్రి నుంచే వేడుకలు ప్రారంభమయ్యాయి. క్రిస్మస్ వేడుకలకు ఉమ్మడి జిల్లాలోని చర్చిలన్నీ రంగురంగుల విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. వాడవాడలా క్రిస్మస్ ట్రీలు, స్టార్లతో సందడి వాతావరణం నెలకొనగా.. వస్త్ర దుకాణాలు, స్వీట్ షాపులు, కేక్‌ల తయారీ కేంద్రాల వద్ద రద్దీ కనిపించింది.


# 'స్వేద పత్రం'లో జిల్లా ప్రగతి

- వెలకట్ట లేని ఫలితాలు ఇచ్చిన ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకం
- వరద, కాకతీయ కాలువల కింద సాగుకు భరోసా
- మోటర్ల వైర్లు తెంపేయ లేదు..పోలీస్ స్టేషన్లలో పెట్టలేదు
- ప్యాకేజీ -21 ద్వారా సుమారు రెండు లక్షల ఎకరాలకు సాగునీరు
- 'భగీరథ'తో తండాలు, గిరిజన గ్రామాలకు శుద్ధ జలాలు
- నిజాంసాగర్ ఆయకట్టుకు పూర్వ వైభవం
- కేటీఆర్ ప్రజెంటేషన్‌లో జిల్లా ప్రగతి ఆవిష్కృతం
- ఆర్‌అండ్‌బీ మంత్రిగా పాలేరులా కష్టపడ్డాడని వేములను కొనియాడిన రామన్న

సీఎం కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ రాష్ట్రం అద్భుత ప్రగతి సాధించింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం తొమ్మిదిన్నరేండ్లలో రాష్ట్రాన్ని కనివినీ ఎరుగని రీతిలో అభివృద్ధి చేసింది. తెలంగాణను దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా నిలబెట్టింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం సాధించిన తొమ్మిదిన్నర సంవత్సరాల ప్రగతిపై నూతనంగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం శ్వేత పత్రాల పేరుతో విమర్శలు చేస్తున్నది. ఈ నేపథ్యంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హైదరాబాద్‌లో తెలంగాణ భవన్‌లో ఆదివారం స్వేదపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో నిజామాబాద్ జిల్లాలో కేసీఆర్ పాలనలో జరిగిన అభివృద్ధి ఆవిష్కృతమైంది.
–కమ్మర్‌పల్లి, డిసెంబర్ 24

## పునరుజ్జీవ పథకంతో అద్భుత ఫలితాలు

ఎస్సారెస్పీ ఎగువన నాడు పొరుగు రాష్ట్రం వరుస ప్రాజెక్టులు నిర్మించడం, మరో పక్క వర్షాభావ పరిస్థితులు ఉండేవి. ఎగువన మహారాష్ట్ర నుంచి నీటి లభ్యత గణనీయంగా తగ్గిపోయి శ్రీరాంసాగర్ ప్రాజెక్టు తరచూ ఖాళీ కుండలా దర్శనమిచ్చేది. స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ ఎస్సారెస్పీకి కాళేశ్వరం నీటిని అందించేలా రూ.1000 కోట్లతో ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకాన్ని అందించారు. రివర్స్ పంపింగ్ ద్వారా ఎస్సారెస్పీ వరద కాలువలో ఏడాదంతా కాళేశ్వరం జలాలు ఉంచుతున్నారు. దీంతో నాడు ఒక్క పంటకు నీరివ్వని వరద కాలువ.. నేడు సాగునీటి చింత లేకుండా రెండు పంటలకు నీరందిస్తున్నది. కాళేశ్వరం జలాలను తెచ్చి వరద కాలువ ఆయకట్టుకు అందించుకునే వీలుతో ఎస్సారెస్పీలో ఎప్పుడైనా చివరిగా మిగిలిన నీటిని సైతం కాకతీయ కాలువకు అందించుకునే భరోసా ఏర్పడింది. దీంతో కాకతీయ కాలువ సైతం మూడు కాలాలు నీటితో కళకళలాడుతున్నది. ఇదంతా కేసీఆర్ సర్కారు సాగు నీటి వనరులు పెంచడం ద్వారా సాధ్యమైంది. దీనిని అప్పుగా చూస్తే తమకు సాగు నీరు అందేది కాదని రైతులు అంటున్నారు.


నిజామాబాద్‌లో కేటీఆర్ స్వేదపత్రం ప్రజెంటేషన్‌ను టీవీలో ఆసక్తిగా తిలకిస్తున్న ఓ కుటుంబం

తాగు నీటి తిప్పలు కేసీఆర్ హయాంలో తీరిన వైనాన్ని గుర్తు చేశారు కేటీఆర్. జిల్లాలో మిషన్ భగీరథ ద్వారా ఎస్సారెస్పీ నుంచి నీటిని మిషన్ భగీరథ ద్వారా అందిస్తున్నారు. నాడు మారుమూల గిరిజన తండాలు, గ్రామాల మహిళలు బిందెలు నెత్తిన పెట్టుకొని వాగులు, చెలిమెలకు ఎంతో దూరం నడిచివెళ్లేవారు. నేడు జిల్లాలో మారుమూల గిరిజన తండాలకు సైతం భగీరథ ద్వారా ఎస్సారెస్పీ నీళ్లు చేరుతున్నాయి.

## పాలేరులా శ్రమించిన వేముల ప్రశాంత్‌రెడ్డి
### స్వేదపత్రం ప్రజెంటేషన్‌లో కొనియాడిన కేటీఆర్

స్వేద పత్రం ప్రజెంటేషన్‌లో వివరిస్తున్న క్రమంలో రోడ్లు, భవనాలు, ప్రభుత్వ కార్యాలయాల సొంత భవనాలు, నూతన కలెక్టర్లు, సచివాలయం తదితర చారిత్రక నిర్మాణాల గురించి వివరిస్తూ ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రిగా వేముల ప్రశాంత్ రెడ్డి రేయింబవళ్లు పడిన కష్టాన్ని కేటీఆర్ గుర్తు చేశారు. రాష్ట్ర అభివృద్ధిలో చేపట్టిన చారిత్రక నిర్మాణాల్లో మంత్రిగా వేముల ప్రశాంత్ రెడ్డి ఒక పాలేరులా శ్రమించారని కొనియాడారు.

## పండుగలా వ్యవసాయం

జిల్లాలో నిజాంసాగర్ భూములకు నీరు అందించేందుకు కేసీఆర్ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. కాలువలను బాగు చేయించింది. దీంతో దశాబ్దాల తర్వాత బోధన్, నిజామాబాద్ రూరల్, ఆర్మూర్, బాల్కొండ నియోజక వర్గాల్లో చివరి ఆయకట్టు వరకు నీరందించుకునే పరిస్థితి ఏర్పడింది. వీటితోపాటు జిల్లాలో విద్యుత్ సామర్థ్యం, విద్యుత్ సబ్ స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లను పెంచి సరిపడా నాణ్యమైన విద్యుత్‌ను ఉచితంగా ఇవ్వడంతో రైతులు బోరు బావులు, మోటర్లు పెంచుకొని వ్యవసాయాన్ని పండుగలా మార్చుకున్నారు. ఎస్సారెస్పీ కాలువల వెంట గతంలో రైతుల మోటర్లు నాణ్యమైన కరెంటు లేక తరచూ కాలిపోతూ నష్టాలు మిగిల్చేవి.దీనికి తోడు అధికారులు మోటర్లు పెట్టుకోవడానికి అభ్యంతరం చెప్పేవారు. నాడు ఎస్సారెస్పీ కాలువల వెంట వైర్లను తెంపేసి మోటర్లను తన్నేసేవారు. వాటిని తీసుకెళ్లి పోలీస్ స్టేషన్లలో పెట్టేవారని 'స్వేద పత్రం'లో కేటీఆర్ గుర్తు చేశారు.ఆ పరిస్థితిని, కేసీఆర్ పాలనలో మోటర్ల వైపు ఎవరూ కన్నెత్తి కూడా చూడని వైనాన్ని ఈ సందర్భంగా రైతులు గుర్తు చేసుకుంటున్నారు.

## నాణ్యమైన విద్యుత్ సరఫరా



పరాయి పాలకుల హయాంలో నేరపూరిత నిర్లక్ష్యం కారణంగా తెలంగాణలో ఎలాగైతే సాగు నీరు లేక వ్యవసాయం కుంటుపడిపోయిందో.. నిజామాబాద్ జిల్లాలోనూ పరాయి పాలకుల పార్టీల నిర్లక్ష్యం కారణంగా వ్యవసాయం కుంటు పడిపోయి ఉండేది. బోరు బావులే శరణ్యమైన పరిస్థితుల్లో బోరుబావుల కోసం తమ భార్యల పుస్తెలను అమ్మి మరీ అప్పులు సాగు చేసిన జిల్లా రైతులకు కేసీఆర్ పాలనలో సాగు నీటి వనరులు పెరిగాయి. పుష్కలంగా, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందింది. కాలువల్లో మూడు కాలాలు అందుబాటులోకి వచ్చిన సాగు నీటిని మోటర్లు పెట్టి మరీ తమ పంటలకు తోడుకుంటే.. గత పాలకుల హయాం లో మాదిరిగా రైతుల మోటర్లను అడ్డుకునే దుస్థితి తొలగిపోయింది.

### కొత్త రాష్ట్రంలో ఎన్నో సవాళ్లు..



తెలంగాణ ఏర్పాటు సమయంలో ఎన్నో సవాళ్లు ముందుండేవి. ఆర్థిక చిక్కులు, రాజకీయ కుట్రలు, విభజన చట్టం అమలు కష్టాలు, ఉద్యోగులు, ఆస్తుల పంపిణీ, విద్యుత్ కొరత, తాగు, సాగునీటి కష్టాలతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం బాధ్యతలు చేపట్టి ప్రగతి పాలనకు శ్రీకారం చుట్టింది. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ వీటన్నింటినీ అధిగమించి ఆర్థిక ప్రణాళికలు, క్రమశిక్షణ, అనేక సంస్కరణలు, పాలనా వికేంద్రీకరణ చేయడంతోపాటు అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపారు. -వెంకట్రావ్‌దేశాయ్, బిచ్కుంద

### దేశానికే ఆదర్శం బీఆర్‌ఎస్ పాలన



రాష్ట్రాన్ని కేసీఆర్ దేశానికే ఆదర్శంగా నిలిపారు. ఉచిత కరెంటు కోసం రూ.36,899 కోట్లు కేటాయించారు. రైతులకు రూ. 30వేల కోట్ల రుణ మాఫీ, రైతుబంధు కింద రూ. 73వేల కోట్లు పంపిణీ చేశారు. రైతుబీమా కింద రూ. ఐదు లక్షల చొప్పున అందజేశారు. రూ.1,34,768 కోట్ల విలువ చేసే ధాన్యాన్ని కొనుగోలు చేశారు. అంతేకానీ రాష్ట్రాన్ని అప్పులపాలు చేయలేదు. -వాజిద్‌అలీ, మహ్మద్‌నగర్

### నాగమడుగు మత్తడికి రూ.476 కోట్లు



నాన్ కమాండ్ ఏరియాను సైతం సస్యశ్యామలం చేయాలన్న లక్ష్యంతో సీఎం కేసీఆర్ మా మండలంలోని మంజీరా పరీవాహక ప్రాంతంలో రూ.476 కోట్లతో నాగమడుగు మత్తడి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. సాగు నీటిరంగానికి ప్రభుత్వం రూ.1,76వేల కోట్లు ఖర్చు చేసి నూతనంగా 50 వేల ఎకరాల ఆయకట్టును స్థిరీకరణ చేశారు. -విఠల్‌రెడ్డి, మల్లూర్

## ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా జూపల్లి


ఖలీల్‌వాడి, డిసెంబర్ 24: రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలకు ఇన్‌చార్జి మంత్రులను నియమిస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు జూపల్లి కృష్ణారావును నియమించింది. ఇన్‌చార్జి మంత్రులు త్వరలో ప్రారంభం కానున్న ప్రజాపాలన అమలును సమీక్షించనున్నారు.

## బ్యాంకు ఖాతా వివరాలు ఎవరికీ చెప్పొద్దు
### వినియోగదారుల చట్టాలపై అవగాహన ఉండాలి
### జాతీయ వినియోగదారుల దినోత్సవంలో అదనపు కలెక్టర్ యాదిరెడ్డి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ యాదిరెడ్డి

ఖలీల్‌వాడి, డిసెంబర్ 24 : బ్యాంకు ఖాతా, ఓటీపీ వివరాలు ఎవరికీ చెప్పొద్దని అదనపు కలెక్టర్ యాదిరెడ్డి సూచించారు. కలెక్టరేట్‌లోని జిల్లా పౌరసరఫరాల అధికారి కార్యాలయంలో జిల్లా పౌరసరఫరాల అధికారి చంద్రప్రకాశ్ ఆధ్వర్యంలో ఆదివారం జాతీయ వినియోగదారుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అదనపు కలెక్టర్ యాదగిరి హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ వినియోగదారుల చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఆన్‌లైన్ షాపింగ్ తదితర సామాజిక మాధ్యమాల ద్వారా వచ్చే తప్పుడు ప్రకటనలకు ఆకర్షితులై మోసపోవద్దన్నారు. వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.


మోర్తాడ్ మండలం గాండ్లపేట్ బ్రిడ్జి వద్ద ఆదివారం ఉదయం 8గంటల ప్రాంతంలో ఏర్పడిన పొగమంచు

## పెద్దవాగు పరిసరాల్లో పొగమంచు
### వాహన రాకపోకలకు అంతరాయం

మోర్తాడ్, డిసెంబర్ 24: మోర్తాడ్ మండలం పెద్దవాగు పరిసరాల్లో ఆదివారం ఉదయం నుంచి పొగమంచు కప్పేసింది. గాండ్లపేట్ బ్రిడ్జివద్ద పొగమంచు కారణంగా వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. జాతీయరహదారిపై ముందర ఏముందో కనిపించని పరిస్థితి ఏర్పడడంతో వాహనదారులు లైట్లు వేసుకుని వెళ్లాల్సి వచ్చింది. దొన్కల్ శివారు నుంచి గాండ్లపేట్ గ్రామం వరకు పొగమంచు ఏర్పడడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

## విధి నిర్వహణలో ఉన్న కానిస్టేబుల్ మృతి
### గుండెపోటుతో మరణించినట్లు నిర్ధారణ


రామాంజనేయులు కోటి (ఫైల్)

నిజామాబాద్ క్రైం, డిసెంబర్ 24 : నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఐదో టౌన్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న సివిల్ కానిస్టేబుల్ రామాంజనేయులు కోటి(40)ఆదివారం ఉదయం నిర్వహణ ఉన్న సమయంలోనే మృతి చెందాడు. ఐదో ఠాణా సిబ్బంది తెలిపిన మేరకు వివరాలు ఇలావున్నాయి. 2009వ బ్యాచ్ సివిల్ కానిస్టేబుల్‌గా ఉన్న కోటి గతంలో భీమ్‌గల్‌లో విధులు నిర్వర్తించి అక్కడి నుంచి బదిలీపై నిజామాబాద్ ఐదో టౌన్ పోలీస్ స్టేషన్‌కు వచ్చాడు. నగరంలోని మహాలక్ష్మి నగరలోని కోటి శనివారం నైట్ డ్యూటీ చేసి స్టేషన్‌లోనే ఉన్నాడు. ప్రతి రోజు మాదిరిగానే ఆదివారం ఉదయం 9.45 గంటలకు ఠాణాలో ఇతర సిబ్బందితో కలిసి రోల్‌కాల్‌లో పాల్గొన్నాడు. 10 గంటలకు డ్యూటీ నుంచి రిలీవ్ అయ్యాక ఇంటికి వెళ్లేందుకు సిద్ధమయ్యాడు. ఇంతలోనే తనకు తిప్పినట్లు అవుతుందని కొద్ది సమయం పాటు రెస్టు తీసుకుంటానని స్టేషన్ పై అంతస్తులో ఉన్న హాల్‌లోకి వెళ్లాడు. అప్పుడే వాంతులు కావడంతో పాటు చెమటలు పట్టి కింద పడిపోయాడు. గమనించిన తోటి సిబ్బంది వెంటనే దవాఖానకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య రోజా, పిల్లలు సాన్విక,త్రిషిక ఉన్నారు. కోటి మృతితో తోటి సిబ్బంది, బ్యాచ్‌మేట్స్ తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. కుటుంబ సభ్యులు శోకసముద్రంలో మునిగిపోయారు. అదనపు డీసీపీ జయరామ్, ఏసీపీ కిరణ్ కుమార్, నార్త్ రూరల్ సీఐ సతీశ్, వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు కోటి మృతదేహానికి నివాళులు అర్పించారు. అంత్యక్రియల కోసం ఆయన సతీమణికి రూ.20వేలు అందజేశారు.

## శోభాయమానం
### కామారెడ్డిలో రామ మందిరం అక్షింతల కలశ శోభాయాత్ర

కామారెడ్డి, డిసెంబర్ 24 : అయోధ్య అక్షింతలు కామారెడ్డి నగరానికి వచ్చిన సందర్భంగా తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో అక్షింతల కలశాలతో పురవీధుల గుండా ఆదివారం శోభాయాత్ర నిర్వహించారు. ఈ శోభాయాత్రను కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. శోభాయాత్ర స్థానిక ధర్మశాల నుంచి సరస్వతీ శిశు మందిర్ పాఠశాల వరకు కొనసాగింది. శోభాయాత్రలో హిందువులు నృత్యాలు చేస్తూ యాత్రను కొనసాగించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర తీర్థ క్షేత్ర సంపర్క అభియాన్ ప్రాంత సంయోజక్ గణపురం రాజేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మర్యాద పురుషోత్తముడు శ్రీరామచంద్రుల మందిరం సాకారం కానున్నదని తెలిపారు. అక్షింతలు కలశాలలో తయారుచేసి 700 గ్రామాలకు ఇచ్చామని చెప్పారు. శోభాయాత్రలో చిన్నారులు రాముడి వేషధారణలో సందడిచేశారు. కార్యక్రమంలో హిందూ సంఘాల నాయకులు, తీర్థ క్షేత్ర ట్రస్ట్ సభ్యులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.


కామారెడ్డి పట్టణంలో నిర్వహించిన శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు



## తగ్గిన నీటి మట్టం.. బయటపడిన ఆలయ శిఖరం

మండలంలోని కందకుర్తి గ్రామ సమీపంలో ఉన్న గోదావరినదిలోని పురాతన శివాలయం బయటపడుతున్నది. వర్షాకాలంలో నది ప్రవాహానికి ఆలయం నీట మునిగింది. దిగువన ఎత్తిపోతల పథకం ద్వారా యాసంగి సాగుకోసం నీటిని విడుదల చేయడంతో నదిలో నీటిమట్టం క్రమంగా తగ్గుముఖం పడుతోంది. దీంతో నదిలోని పురాతన శివాలయ శిఖరం భక్తులకు దర్శనమిస్తున్నది.
–రెంజల్, డిసెంబర్ 24

## దుకాణంలో పేలిన సిలిండర్..


పేలుడు ధాటికి రోడ్డుపై ఎగిరిపడిన రేకులు

నిజామాబాద్ క్రైం, డిసెంబర్ 24 : నిజామాబాద్ నగరంలోని శివాజీనగర్ ప్రాంతలోని ఓ దుకాణంలో ఆదివారం ఉదయం ప్రమాదవశాత్తు సిలిండర్ పేలింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యనగర్ వద్ద ఉన్న దుర్గాదేవి కర్రీ పాయింట్‌ను నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉదయం షాపు మూసి ఉన్న సమయంలో ఒక్కసారిగా భారీ శబ్ధంతో సిలిండర్ పేలింది. పేలుడు ధాటికి షాపు ముందు ఉన్న రేకులు సైతం ఎగిరిపోయి రోడ్డు పడ్డాయి. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

## ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఇందల్వాయి, డిసెంబర్ 24: గురుకుల పాఠశాలల్లో 2024-25 సంవత్సరానికి ఐదో తరగతిలో ప్రవేశానికి ప్రకటన వెలువడిందని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల ధర్మారం ప్రిన్సిపల్, జిల్లా సమన్వయకర్త బి.సంగీత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు జనవరి 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, విద్యార్థులు ప్రస్తుతం 4వ తరగతి చదువుతూ ఉండాలని, బోనాఫైడ్, ఫొటో,సంతకాన్ని ఆన్‌లైన్ దరఖాస్తు ఫారంలో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు http://tgcet.cgg.gov.in, www.tswries.ac.in, http://tgtwgurukulam. telangananа.gov.in & http://mjptbcwries. telangana.gov.in వెబ్‌సైట్లను సందర్శించాలని తెలిపారు.






రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం కలెక్టర్లు, ఎస్పీలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఉభయ జిల్లాల కలెక్టర్లు రాజీవ్‌గాంధీ హన్మంతు, జితేశ్ వీ పాటిల్, సీపీ కల్మేశ్వర్, ఎస్పీ సింధూశర్మ, అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా పాల్గొన్నారు.
–నిజామాబాద్ స్పోర్ట్స్ /కామారెడ్డి, డిసెంబర్ 24